
సాక్షి
ఒడిశా
మంగళవారం । 27 । జూన్ । 2023



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,90,624లు వచ్చాయని అధికారులు తెలిపారు.



**మత్తుకు చిత్తు కావొద్దు..**

-8లో



**మండిబిసిలో ఆదివాసీల ఆహార మేళ**

-8లో

## న్యూస్‌రీల్

### అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

**పర్లాకిమిడి:** కాశీనగర్ సమితి కె.సీతాపురం పంచాయతీ మిలగాంగూడ గ్రామస్తులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఖరడ పంచాయతీలో గ్రీవెన్స్‌సెల్ ముగించుకుని తిరిగి వస్తున్న కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ లను అడ్డుకున్నారు. పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తమ గ్రామానికి ఉన్న సుమారు కిలోమీటరు రోడ్డు పనులను కొన్నేళ్ల క్రితం నిలిపి వేశారని వాపోయారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటునని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు.

### అశోక్ పాణిగ్రహికి నివాళులు



పాణిగ్రహి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొండబాబు

**రాయగడ:** రాయగడ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్, లారీ యజమానుల సంఘం మాజీ కార్యదర్శిగా సేవలందించిన అశోక్‌కుమార్ పాణిగ్రహి 63వ జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రైతుల కాలనీ సమీపంలోని లారీ యజమానుల సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బీజేడీ సీనియర్ నాయకుడు, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు ఎల్ల కొండబాబు మాట్లాడుతూ పాణిగ్రహి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లారీ యజమానులు, అభిమానులు పాల్గొన్నారు.

### కాసీపూర్‌కు మరో నలుగురు వైద్యులు

**రాయగడ:** జిల్లాలోని కాసీపూర్ సమితికి మరో నలుగురు వైద్యులను ప్రభుత్వం నియమించింది. టికిరి, కుచేయిపాదోరో, డొంగాశిలి, గోరఖ్‌పూర్ పంచాయతీల్లో ఉన్న పీహెచ్‌సీల్లో వీరంతా సేవలందించనున్నారు. ఈ మేరకు డాక్టర్ విశ్వనాథ్ జగరంగ, డాక్టర్ పార్థసారధి మహంతి, డాక్టర్ అమిత్‌కుమార్ బిసాయి, డాక్టర్ అర్పితాదాస్ బాధ్యతలు స్వీకరించారు.

### యువత 'స్వచ్ఛ' సంకల్పం



చెత్త సేకరిస్తున్న యువకులు

**పర్లాకిమిడి:** పట్టణంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు యువత ముందుకు రావాలని బీజేడీ సీనియర్ నాయకులు బర్నాల జనార్దనరావు అన్నారు. స్థానిక బీఎస్ ప్యాలెస్ రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు స్థానిక యువత సోమవారం చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వారిని ప్రశంసించి, మరిన్ని కార్యక్రమాలు చేయాలని సూచించారు.

# అర్ధరాత్రి ఆక్రందనలు..

అంతా గాఢ నిద్రలో ఉండగా.. ఓ కుదుపు జీవితాన్ని తల్లకిందులు చేసింది. రెప్పపాటులో ఊహకందని విషాదాన్ని మిగిల్చింది. కొద్ది సేపటి వరకు ఆనందంగా గడిపిన వారంతా విగత జీవులుగా మారారు. మరికొద్ది దూరంలో గమ్యం చేరుకోవాల్సిన వారు.. తిరిగిరాని లోకాలకు మరలి పోయారు. చిమ్మ చీకటిలో తప్పెవరిది? అని వెతుకాలాడే కంటే.. అతి వేగమే బాధిత కుటుంబాలకు సమాధానం చెప్పాల్సి ఉంది.

– బరంపురం

- ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ–పెళ్లి బృందం బస్సులు
- దిగపండి–కెముండి 59వ జాతీయ రహదారిలో ఘటన
- 12మంది ప్రయాణికులు మృతి.. 15మందికి తీవ్ర గాయాలు
- బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, ఎస్పీ వివేక్



క్షతగ్రాతులను ఎంకేసీజీ ఆస్పత్రికి తరలిస్తున్న ఓడ్రాప్ బృందం





ఎంకేసీజీలో మృతుల వద్ద రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్లో) ఘటనా స్థలంలో నుజ్జయిన బస్సు

గంజాం జిల్లాలోని దిగపండి సమీపంలోని కెముండి కళాశాల ఆదివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. 59వ జాతీయ రహదారిలో బరంపురం నగరానికి కేవలం 16 కిలోమీటర్ల సమీపంలో ఎదురెదురుగా వస్తున్న 2బస్సులు బలంగా ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో 12మంది ప్రయాణికులు అక్కడికక్కడే చెందగా, మరో 15మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది, ఒడ్రాప్ బృందం సాయంతో క్షతగాత్రులను తొలుత దిగపండి ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రికి, అక్కడి నుంచి బరంపురం ఎంకేసీజీకి తరలించారు. దీనిపై కలెక్టర్ పరిడా, ఎస్పీ వివేక్, బాధిత ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడారి నుంచి బరంపురం మీదుగా భువనేశ్వర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు.. ఆదివారం రాత్రి 12గంటల సమయంలో దిగపండి చేరుకుంది. బరంపురం నగరంలోని హతిబొందొ వీధికి చెందిన పెళ్లి బృందం ప్రైవేటు బస్సులో దిగపండి సమీపంలో జరిగిన వివాహానికి హాజరై, తిరుగు పయనమైంది. రెండు బస్సులూ కెముండి కళాశాల మలుపులో ఎదురెదురుగా వేగంగా వస్తూ ఢీకొన్నాయి.

**ప్రయాణికుల హాహాకారాలు..**

అప్పటి వరకు చిమ్మ చీకట్లో నిశ్శబ్దంగా ఉన్న ఆ ప్రాంతం.. ఒక్కసారిగా ప్రయాణికుల ఆక్రమందనలతో దద్దరిల్లింది. కొంతమంది హాహాకారాలు చేస్తూ.. ప్రాణ భయంతో బస్సు నుంచి కిందకు దూకి, పరుగులు తీశారు. ప్రయాణికుల్లో 12మంది అక్కడికక్కడే మృతిచెందగా, మరో 15మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న బరంపురం, దిగపండి అగ్నిమాపక, ఒడ్రాప్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, బస్సులో చిక్కుకున్న మృతదేహాలు, క్షతగ్రాతులను బయటకు తీశారు. తొలుత దిగపండి పీహెచ్‌సీకి తరలించి, ప్రాథమిక వైద్యం అందించారు. కొంతమంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో 108 అంబులెన్స్‌లో మెరుగైన చికిత్స నిమిత్తం బరంపురం ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కటక్ ఆస్పత్రికి రిఫర్ చేశామని ఎంకేసీజీ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ మిశ్రా తెలిపారు. ఘటనపై దిగపండి పోలీసులు కేసు నమోదు, చేసి దర్యాప్తు చెస్తున్నారు.

### ట్రక్కు ఢీకొని యువకుడు..



రోడ్డుపై ఆందోళనకు దిగిన మృతుడి కుటుంబ సభ్యులు

**జయపురం:** ట్రక్కు ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటనలో బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని బంధువులు, గ్రామస్తులు, ఆందోళనకు దిగారు. జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి ఘటనా స్థలానికి చేరుకొని, ఆందోళనకారులకు నచ్చజెప్పారు. ట్రక్కు యజమానితో చర్చించి, పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై బొయిపరిగుడ పోలీసు అధికారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ–రాంచీ 326 జాతీయ రహదారి మల్కన్‌గిరి–బొయిపరిగుడ మార్గంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. మాచ్‌ఖండ్ పోలీసు స్టేషన్ పరిధి ఖొడాగొజి గ్రామానికి చెందిన చంద్ర ఖిలో(28) శనివారం సాయంత్రం ముదులిగుడ గ్రామంలోని తన బంధువుల ఇంటికి వ్యక్తిగత పనిపై వెళ్లాడు. ఆదివారం సాయంత్రం తన గ్రామానికి బైక్‌పై తిరిగి వస్తుండగా బొయిపరిగుడకు 2 కిలోమీటర్ల దూరంలో బొగ్గు లోడుతో ఎదురుగా వస్తున్న ట్రక్కు ఢీకొంది. ప్రమాదంలో ఖిలో ట్రక్కు చక్రం కిందపడి, అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే ట్రక్కు డ్రైవర్ వెంటనే బొయిపరిగుడ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. ప్రమాద విషయం తెలుసుకున్న మృతుడు బంధువులు, ముదులిగుడ గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. జాతీయ రహదారిపై బైఠాయించి, రస్తారోకో చేపట్టారు. దీంతో అటుగా వెళ్తే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించేందుకు వారంతా అంగీకరించలేదు. ఈ మేరకు బొయిపరిగుడ తహసీల్దార్, జయపురం ఎస్‌డీపీఓ ఆందోళనకారులతో చర్చించారు. ట్రక్కు యజమానితో చర్చించి తగిన పరిహారం ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో వారంతా శాంతించారు.

# బహుడాకు ముందే 'వెండి వెలుగులు'



సింహద్వారం తలుపు వెండి తాపడం పనుల్లో సిబ్బంది

- శ్రీమందిరం సింహద్వారానికి రజత తాపడం పనులు



శ్రీమందిరం ఆవరణలో వెండి తాపడం సరంజామా

**భువనేశ్వర్:** జగన్నాథుని నవదినాత్మక గుండిచా యాత్ర పురస్కరించుకుని శ్రీమందిరం ఖాళీ అయ్యింది. స్వామి తిరిగి శ్రీమందిరం రత్నవేదిక అలంకరించే ముందే అంతరాలయం మరమ్మతు, నిర్వహణ పనులు పూర్తి చేయాలని యంత్రాంగం కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీమందిరం సింహద్వారం తలుపుల వెండి తాపడం పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. మారు రథయాత్ర(బహుడా)కు ముందే ఈ పనులు పూర్తి చేయనున్నట్లు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) అధికార వర్గాలు తెలిపాయి. సోమవారం ఉదయం సింహద్వారం ఒక తలుపు రజత తాపడం పూర్తయ్యింది. 15మందికి పైగా కార్మికులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. దీనిని పురస్కరించుకుని శ్రీమందిరం వాస్తవ రూపురేఖల్లో ఎటువంటి మార్పులు ఉండవని స్పష్టంచేశారు. పనుల నేపథ్యంలో ఆలయ సింహద్వారం ముందు ప్రాంతం సీలు చేసి, సాధారణ వర్గాలు తిరుగాడటం నివారించారు. సీసీ కెమెరాలు, పోలీసులు, న్యాయాధికారుల సమక్షంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు మధ్య వెండి తాపడం తలుపులు బిగిస్తారు. ఇది వరకే ఆలయం లోపల 8ద్వారాల వెండి తాపడం పనులు పూర్తి చేశారు. త్వరలో భక్తులకు ఆలయ సింహద్వారం వెండి వెలుగులతో ప్రత్యక్షం కానుంది.

### నైపుణ్య శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న మన్‌మోహన బెహరా

**జయపురం:** ముఖ్యమంత్రి ముక్త యోజన పథకంలో మహిళా స్వయం సహాక సంఘాలకు చెందిన మహిళలు, యువతకు శిక్షణ శిబిరం సోమవారం నిర్వహించారు. జయపురం లోని బాబాసాహెబ్ కల్యాణ మండపంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, ఈఓ సిద్ధార్థ పట్నాయక్, శిక్షణాధికారులు మన్‌మోహన మహరాణ, ఉపహార్ బెహరా పాల్గొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకుల, ఎస్‌హెచ్‌జీలకు సామర్థ్య నిర్మాణంపై అవగామన కల్పించారు.

# ఖరడ గ్రీవెన్స్‌కు స్పందన



గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ ప్రధాన్, ఎస్పీ స్వాతి

**పర్లాకిమిడి:** గజపతి జిల్లా కాశీనగర్ సమితి ఖరడ పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రామముఖి పరిపాలన, గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ హాజరయ్యారు. ఇందులో ఖరడ, కిడిగాం, హడ్డుబంగి, కె.సీతాపురం పంచాయతీల నుంచి 65 వినతులు అందాయి. వ్యక్తిగత సమస్యలు 32, గ్రామ సమస్యలు 33 ఉన్నాయి. వీటిలో ఒక వినతిని కలెక్టర్ తక్షణమే పరిష్కరించారు. కాశీనగర్ ఎన్ఏసీకి చెందిన పి.రామారావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 వేల చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. అనంతరం 36 మందికి భూమి, ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. గ్రీవెన్స్‌కు కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల సాయమ్మ, సర్పంచ్ అఖిల పాత్రొ, బీడీఓ కపిలేశ్వర తండి, తహసీల్దార్ ఆశిష్ ప్రధాన్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# భద్రతా వైఫల్యం!

- వైరల్‌గా మారిన పూరీ జగన్నాథ ఆలయం లోపలి దృశ్యాలు
- ఇన్‌స్ట్రాగాంలో పోస్ట్ చేసిన వారణాసికి చెందిన వ్యక్తి





ఇన్‌స్ట్రాగాంలో నిందితుడు పోస్ట్ చేసిన శ్రీమందిరం లోపలి చిత్రాలు

**భువనేశ్వర్:** అధికారులు అనేక ఆంక్షలు విధించినప్పటికీ, పూరీ జగన్నాథ ఆలయం లోపలి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో దుమారం రేపుతున్నాయి. తరచూ ఇదే పరిస్థితి కొనసాగుతున్నా.. నిఘా వ్యవస్థ లోపంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిస్థితులు ఆలయ భద్రత వ్యవస్థ పటిష్టతకు సవాల్‌గా నిలుస్తున్నాయి. శ్రీమందిరం లోపలికి సెల్ ఫోన్లు, కెమెరాలు ఇతరేతర సాంకేతిక పరికరాలు, యంత్రాల ప్రవేశం పూర్తిగా నిషేధం. ఈ నేపథ్యంలో సింహద్వారం ఆవరణలో పటిష్టంగా తనిఖీలు నిర్వహించి, లోపలికి ప్రవేశించేందుకు అనుమతించే విధానం అమలులో ఉంది. ఈ వ్యవస్థ కార్యచరణ లోపంతో తాజాగా మరో ఘటన వెలుగు చూసింది. ఓ వ్యక్తి శ్రీమందిరం ప్రధాన దేవస్థానం లోపలి దృశ్యాలను వీడియో చిత్రీకరించి, సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ పరిస్థితులు తీవ్ర కలకలం రేపి, విశిష్ట మందిరం భద్రతపై తీవ్రమైన ప్రశ్నలకు అవకాశం కల్పిస్తున్నాయి. వీడియోలో తారసపడిన వ్యక్తి స్థానికేతరుడుగా భావిస్తున్నారు. ఈ దృశ్యాల్ని తన ఇన్‌స్టాగామ్ ఖాతాలో అప్‌లోడ్ చేసి, విడుదల చేయడంతో వివాదం ఊపందుకుంది. దీని ప్రకారం వివాదాస్పద యాత్రికుడు వారణాసికి చెందిన వ్యక్తి రోహిత్ జైస్వాల్‌గా గుర్తించారు. ఆలయ ప్రాంగణంలో సెల్‌ఫోన్లు నిషేధించినా.. తనతో పరికరాన్ని ఎలా తీసుకు వెళ్లడనే దానిపై అనుబంధ వర్గాలు తక్షణమే స్పందించలేని దయనీయ పరిస్థితులు తాండవిస్తున్నాయి.

**స్వామివారు లేని సమయంలో..**

తోబుట్టువులతో కలిసి జగన్నాథుడు గుండిచా మందిరానికి యాత్రగా వెళ్లిన విషయం తెలిసిందే. ఈ వ్యవధిలో నిత్యం కళకళలాడే శ్రీమందిరం బోసిబోయింది. మరమ్మతులు తదితర నిర్వహణ పనులు కొనసాగుతున్నాయి. అయితే యాత్రికులు శ్రీమందిరం సందర్శించేందుకు ఎటువంటి ఆంక్షలు లేకున్నా.. భద్రతాపరమైన కార్యాచరణ కట్టుదిట్టంగా కొనసాగుతోంది. మూల విరాట్‌లు లేనందున శ్రీమందిరం సందర్శనకు నామమాత్రపు యాత్రికులు మాత్రమే సందర్శిస్తున్నారు. జనసందోహం లేని ఈ వ్యవధిలో భద్రత, తనిఖీ కార్యకలాపాలు మందగించే నిర్లక్ష్య పరిస్థితులను యాత్రికుడు అనుకూలంగా చేసుకొని, లోపలి దృశ్యాల చిత్రీకరణకు పాల్పడేందుకు వీలైందనే ఆరోపణ బలంగా వ్యాపించింది. రాత్రింబవళ్లు నిరవధికంగా కొనసాగాల్సిన భద్రతా వ్యవస్థ కార్యాచరణ పెద్ద సవాల్‌గా నిలిచింది. చర్యలలో అలసత్వం కారణంగా అతను ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించాడా? లేదా ఘటనలో ఎవరిదైనా సహాయం తీసుకున్నాడా? అనే దానిపై స్పష్టత లేదు.

**చర్యలేవీ..?**

జగన్నాథ దేవాలయం లోపలి దృశ్యాల వీడియోలు, చిత్రాలు ఇంతకుముందు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నిందితులను అదుపులోకి తీసుకుని చర్యలు చేపట్టడం మినహా అవాంఛిత సంఘటనల పునరావృతం నివారణ దిశలో పూరీ జిల్లా, పోలీసు, జగన్నాథ ఆలయ పాలక వర్గం ఇతర అనుబంధ వర్గాలు చేపట్టిన చర్యలు శూన్యంగా పరిణమించాయి. లోపలి దృశ్యాల చిత్రీకరణ వివాదస్పద కార్యకలాపాల్లో బాధ్యులైన సిబ్బంది, అధికార వర్గాల వ్యతిరేకంగా చేపట్టిన చర్యల దాఖలాలు లేకపోవడం విచారకరం.

# ముట్టడికి విఫలయత్నం

- టాటా పవర్ కార్యాలయం ఎదుట బీజేపీ కార్యకర్తల ఆందోళన



కార్యాలయం ముట్టడికి ప్రయత్నిస్తున్న బీజేపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

**భువనేశ్వర్:**

తరచూ విద్యుత్ అప్రకటిత విద్యుత్ కోతలు, బిల్లింగ్‌లో అవకతవకలు, బిల్లు జారీలో అవాంఛిత జాప్యం చర్యలకు వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ(బీజేపీ) కార్యకర్తలు స్థానిక టాటా పవర్ కార్యాలయం ఎదురుగా సోమవారం నిరసనగా ప్రదర్శన నిర్వహించారు. కార్యాలయం ముట్టడికి విఫలయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టాటా విద్యుత్ పంపిణీ సంస్థ బిల్లులు సకాలంలో జారీ చేయకుండా వినియోగదారులపై అవాంఛనీయ భారం మోపుతోంది. ప్రతి నెలా జారీ చేయాల్సిన బిల్లులను 40 రోజుల నిడివితో జారీ చేసి, జాప్యంతో వినియోగదారులను నిలువునా దోచుకుంటోందని ఆరోపించారు. ఈ జాప్యంతో వినియోగదారులకు లభించాల్సిన సకాల బిల్లు చెల్లింపు రాయితీ, ప్రోత్సాహకాలు వంటి సదుపాయాలను నిలువునా కొల్లగొడుతుందన్నారు. బిల్లు వివరాల్లో పారదర్శకత లోపిస్తోందని విమర్శించారు. 40 రోజుల బిల్లింగ్ సైకిల్ వ్యవధిలో వినియోగదారుల నుంచి బిల్లు వసూలు చేయడంతో 10 అదనపు రోజులకు అధిక స్లాబ్ రేట్లు వసూలు చేస్తున్నారని వాపోయారు. ఈ అదనపు వసూళ్లను మరుసటి నెల బిల్లులో సర్దుబాటు చేయడంలో టాటా పవర్ సంస్థ నిస్సహాయత ప్రదర్శించి అడ్డగోలుగా అదనపు బిల్లు చార్జీలను వసూలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ అప్రకటిత విద్యుత్ కోతలతో వేధిస్తున్నారని, ఈ సమస్యల నివారణ పట్ల చర్యలు చేపట్టేనాథుడే కరువయ్యాడని వివరించారు. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో చేరుకున్న బీజేపీ కార్యకర్తలు.. బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ టాటా పవర్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన గేటుకు తాళం వేయడానికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు.

## క్లుప్తంగా

### జర్మనీలో స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**విజయనగరం రూరల్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, టీపీకేటీ ఇంటర్నేషనల్-ఏపీఎస్ఆర్‌టీఎస్ ఆధ్వర్యంలో జర్మనీలో స్టాఫ్‌నర్స్ (మహిళలు) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నీలం గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసి 20 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి, సాధారణ ఆస్పత్రులలో రెండేళ్ల అనుభవం కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు విజయవాడలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో 2 నెలల పాటు నిర్వహించే బీ1 స్థాయి జర్మన్ భాష శిక్షణ కోసం ఉచిత తరగతులకు హాజరు కావాలని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికయ్యే అభ్యర్థినులకు విమాన చార్జీలు, ఆహారం, వసతి ఆరు నెలల పాటు ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. నెలకు 1000 యూరోల జీతం చెల్లిస్తారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9988853335, 7730088258 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### బాలుడి అదృశ్యం


అల్ఫిన్ రాజ్

**రాజాం సిటీ:** స్థానిక మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన అల్ఫిన్ రాజ్ (15) అదృశ్యంపై కేసు నమోదుచేశామని సీఐ కె.రవికుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 25న ఉదయం 10 గంటల నుంచి కనిపించకపోవడంతో అంతటా వెతికినప్పటికీ ప్రయోజనం కనిపించకపోవడంతో తండ్రి జోసెఫ్‌రాజ్ ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

### పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


**విజయనగరం క్రైమ్:** గరివిడి మండలం వెదుళ్లవలసకు చెందిన బంకపల్లి శివ (26) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రెండేళ్లుగా శివ కాకినాడ పోర్టులో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన ఇంటికి వచ్చాడు. 12వ తేదీన కాకినాడ వెళ్లిపోతున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. స్థానిక సంతకాల బ్రిడ్జి కిందికి వచ్చి గడ్డి మందు తాగి తన స్నేహితుడికి ఫోన్ చేసి రమ్మీ యాప్‌లో డబ్బులు పోగొట్టుకుని అప్పులపాలయ్యాయని, తాను గడ్డిమందు తాగానని చెప్పి మళ్లీ బస్సు ఎక్కి చీపురుపల్లి వెళ్లాడు. అప్రమత్తమైన స్నేహితుడు శివను చీపురుపల్లిలోని ఆస్పత్రికి తరలించాడు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయనగరం కేంద్రాస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని తల్లి తవుడమ్మ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై మురళి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పచ్చకామెర్లతో ఉపాధ్యాయుడి మృతి


ఉపాధ్యాయుడు ఉమా మహేశ్వరరావు (ఫైల్)

**సీతంపేట:** మండలంలోని పొల్ల గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు వాన ఉమా మహేశ్వరరావు (36) పచ్చకామెర్లతో బాధపడుతూ శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో సోమవారం మృతిచెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పాఠశాలల పునఃప్రారంభం అనంతరం ప్రతిరోజూ పాఠశాలకు వచ్చారు. వ్యాధి తీవ్రం కావడంతో శ్రీకాకుళం జెమ్స్‌లో చికిత్స నిమిత్తం సోమవారం చేరారు. చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన స్వగ్రామం వీరఘట్టం మండలం ఎం.రాజపురం. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉపాధ్యాయుడి మృతి పట్ల గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీఈవో లిల్లీరాణి, పాఠశాల హెచ్‌ఎం మీనక భాస్కరరావు, ఏఎంవో కోటిబాబు, ఉపాధ్యాయులు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

### డ్రైవర్ల మధ్య ఘర్షణ: నిలిచిన ట్రాఫిక్


రోడ్డు మధ్యలో ఆర్టీసీ బస్సులు, ఘర్షణ పడుతున్న డ్రైవర్లు

**పాలకొండ:** ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్ల మధ్య ఘర్షణ తలెత్తడంతో పట్టణంలోని ప్రధాన రహదారిలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం నుంచి పాలకొండ వస్తున్న శ్రీకాకుళం-2 డిపో ఆర్టీసీ బస్సు, పాలకొండ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న పాకొండ డిపోకు చెందిన బస్సు సోమవారం ఉదయం ఏలాం సమీపంలో ప్రధాన రహదారిపై క్రాస్ చేసే సమయంలో రెండు బస్సులు ఒకదానికి ఒకటి తగిలాయి. దీంతో ఇద్దరు డ్రైవర్లు బస్సు దిగి తప్పు నీది అంటే నీది అంటూ తోసుకున్నారు. అంతటితో ఆగకుండా బస్సులు తీయకుండా రోడ్డు మీదనే ఉంచి ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

# మత్తుకు చిత్తు కావొద్దు..


మల్కన్‌గిరి: ర్యాలీ ప్రారంభిస్తున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు


ర్యాలీని ప్రారంభిస్తున్న ఏడీఎం ప్రధాన్

- అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవంలో వక్తలు

**రాయగడ:** మత్తు పదార్థాలకు బానిసలుగా మారి, బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకోవద్దని జిల్లా అదనపు కలెక్టర్ ధర్మానంద బెహరా పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని సందర్భంగా జిల్లా కేంద్రంలోని గజపతి కూడలిలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో జరిగిన చైతన్య ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రాయగడ సంస్కృతి సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలతో తప్పుదోవ పడుతున్నారని విచారం వ్యక్తంచేశారు. దీనివల్ల సంఘ విద్రోహక శక్తులుగా మారి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆవేదన చెందారు. మత్తు వల్ల కలిగే అనర్థాలను తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే దీనిపై అవగాహన కలిగి ఉండాలని, సంఘంలో గౌరవమైన వ్యక్తిగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి బసంతకుమార్ ప్రధాన్, జిల్లా ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు గజపతి కూడలి నుంచి ప్రారంభమైన చైతన్య ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. ర్యాలీలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.


పర్లాకిమిడి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


పర్లాకిమిడి: ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలాశెఠి

**విద్యార్థుల ర్యాలీ..**

**పర్లాకిమిడి:** మత్తు పదార్థాలకు బానిసలుగా మారి, యువత పెడదారి పడుతున్నారని పురపాలక సంఘం చైర్‌పర్సన్ నిర్మలాశెఠి ఆందోళన చెందారు. ఉన్నత సమాజంలో భాగస్వామ్యులయ్యేందుకు అంతా మంచి నడవడిక కలిగి ఉండాలని సూచించారు. పర్లాకిమిడి మున్సిపల్ కార్యాలయంలో అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 'మత్తు పదార్థాలకు బానిస కామని, డ్రగ్స్ నిర్మూలిస్తామని మున్సిపల్ సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు ప్రమాణం చేశారు. అనంతరం పురపాలక కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్, ప్యాలెస్, రాజవీధి మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎగ్జిక్యూటివ్ అధికారి బనమాళి శెఠి, వైస్ చైర్మన్ లెంక మధు, పోలీసు సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# రామాయ.. రామచంద్రాయ..

- ప్రత్యేక పూజలందుకుంటున్న జగన్నాథుడు

**బరంపురం/జయపురం/రాయగడ/పర్లాకిమిడి:** రథయాత్ర ఉత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి. వివిధ గుండిచా మందిరాలలో కొలువైన జగన్నాథుడు.. వామన, పరశురామ, రామ, బలరామ అవతారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. గుసాని నువాగం, కోర్టుపేట, కుకుడాఖండి, మిలటరీ లైన్, జయపురం, రాయగడ, పర్లాకిమిడి లోని ఆలయాలతో పాటు వివిధ కూడల్లలో దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు.


బరంపురం: వామనావతారంలో దర్శనమిస్తున్న దేవతామూర్తులు


జయపురం: రామ, బలరామ అవతారాల్లో దర్శనమిస్తున్న జగన్నాథుడు


పర్లాకిమిడి: కృష్ణ, బలరామ అవతారాల్లో జగన్నాథ, బలభద్రులు


రాయగడ: రామావతారంలో స్వామివారు

# భర్తే హంతకుడు

- వీడిన వివాహిత అనుమానాస్పద మృతి మిస్టరీ
- వెల్లడించిన డీఎస్పీ, సీఐ

**బొబ్బిలి:** మండలంలోని పారాదిలో ఆదివారం ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనలో భర్తే హంతకుడిగా పోలీసుల విచారణలో వెల్ల డైంది. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ పుల్లారు శ్రీధర్, సీఐ ఎం నాగేశ్వరరావులు సోమవారం సాయంత్రం విలేకరులకు వివరించారు. బాడంగి మండలం డొంకిన వలసకు చెందిన పూడి శంకరరావు కుమార్తె గౌరీశ్వరి అలియాస్ విజయను పారాది గ్రామానికి చెందిన సూర్రెడ్డి రవికి ఇచ్చి 11 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వీరు టీ కొట్టు నడుపుతూ జీవిస్తున్నారు. వారికి 9, 10 సంవత్సరాల వయసు గల కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్నాళ్లుగా రవి వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయమై గౌరీశ్వరి తరచూ భర్తతో గొడవ పడుతుండేది. ఆదివారం కూడా వీరిద్దరూ వారి దుకాణం వద్దే తీవ్రంగా గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో గౌరీశ్వరి తండ్రి శంకరరావుకు ఫోన్ చేసి భర్తతో వేగలేకపోతున్నానని, పరిస్థితి బాగాలేదు రమ్మని సమాచారమిచ్చింది.

**తండ్రి కళ్లముందే మృతి చెందిన కుమార్తె**

వెంటనే శంకరరావు కుమార్తె ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో భార్యాభర్తలు గొడవ పడుతుంటే శంకరరావు వారిని సముదాయిస్తూ, పరిష్కారం కోసం ప్రయత్నిస్తుండగానే రవి గౌరీశ్వరిని చెక్కపేడుతో మొఖం, మెడపై తీవ్రంగా కొట్టడంతో ఆమె పక్కనే ఉన్న మంచంపై రక్తం కక్కుకుంటూ ప్రాణాలు విడిచింది. అనంతరం ఆమె చనిపోయిందని తెలుసుకున్న రవికుమార్ గ్రామం పక్కనే ఉన్న హైస్కూల్‌లో దాక్కున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు రవిని పట్టుకుని స్టేషన్‌కు తరలించి, గౌరీశ్వరి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సీఐ ఎం.నాగేశ్వరరావు, సిబ్బంది విచారణలో గౌరరీశ్వరిని భర్త ఉద్దేశపూర్వకంగా హత్య చేసినట్లు వెల్లడైందని డీఎస్పీ తెలిపారు. నిందితుడు భర్త రవిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని. సోమవారం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

# విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పేలిన బ్రేకర్

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని కొండవెలగాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఎల్‌వీ బ్రేకర్ పేలడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సబ్‌స్టేషన్ సిబ్బంది వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది చేరుకుని మంటలు అదుపుచేశారు. బ్రేకర్ లింబు తప్పి విద్యుత్ ప్రవహించే వైరుపై ఒక్కసారిగా పడడంతో 11కేవీ ఎల్‌వీ బ్లాస్ట్ అయ్యిందని విద్యుత్ శాఖ ఏఈ పిచ్చయ్య తెలిపారు. ఈ ఘటనలో సుమారు రూ.11 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని చెప్పారు.

గ్రామానికి విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకం లేకుండా వెంటనే నెల్లిమర్ల పట్టణ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేశామన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు తెలియజేశామని, రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపడతామని వెల్లడించారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

- సభాస్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, కళావతి.
- చినమేరంగి పాల్‌టెక్నిక్ కళాశాల వద్ద హెలిప్యాడ్ సిద్ధం
- అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనే అవకాశం ఉండడంతో పక్కాగా ఏర్పాట్లు

**కురుపాం:**

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 28వ తేదీ బుధవారం కురుపాం వేదికగా నాలుగో ఏడాది అమ్మఒడి పథకం నిధులు విడుదల చేసేందుకు రానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సభాస్థలం, పార్కింగ్, వీఐపీ గ్యాలరీ, హెలిప్యాడ్ ప్రదేశాన్ని కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, జేసీ ఆర్.గోవిందరావు, సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, ఆర్డీఓ హేమలత, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, కళావతి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు తదితరులు సోమవారం పరిశీలించారు. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాకు మొదటిసారిగా సీఎం వస్తుండడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉందని, ఆ మేరకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.


బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు


ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, తదితర అధికారులు

**సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..**


28వ తేదీన జరగనున్న బహిరంగ సభకు సిద్ధమైన ప్రదేశం

- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 28వ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరుతారు. గన్నవరం ఎయిర్‌పోర్టుకు 8.20 నిమిషాలకు చేరుకుంటారు.
- 8.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో 9.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు.
- అక్కడ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో 9.25 గంటలకు బయలు దేరి 10 గంటలకు కురుపాం నియోజకవర్గం చినమేరంగి పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- అక్కడి నుంచి 10.05 గంటకు బయలుదేరి రోడ్డు మార్గంలో 10.30 గంటలకు సభాస్థలం వద్దకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శిస్తారు.
- 10.35 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు.
- 12.25కు హెలీప్యాడ్ వద్దకు చేరుకుని 12.55 వరకు స్థానిక నాయకులతో సమావేశం అవుతారు.
- ఒంటి గంటకు హెలికాప్టర్‌లో తిరిగి విశాఖపట్నం చేరుకుంటారు.

# గ్రంథాలయానికి గవర్నర్ పుస్తకాల విరాళం


గ్రంథాలయానికి పుస్తకాలు అందిస్తున్న గవర్నర్ గణేషీలాల్

**భువనేశ్వర్:** రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ భువనేశ్వర్‌లోని సింఘి గ్రంథాలయం, మ్యూజియానికి 500 పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ పుస్తకాలు విద్యార్థులు, సాధారణ ప్రజల విద్యాభివృద్ధి కోసం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. నగరంలోని కల్పనా స్క్వేర్ సింఘి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ఈ గ్రంథాలయంలో భారతదేశం, విదేశాల నుంచి సేకరించిన వివిధ విషయాలపై 30,000 కంటే ఎక్కువ పుస్తకాలు ఉన్నాయి. ఈ మ్యూజియంలో క్రీస్తుపూర్వం 6వ శతాబ్దపు నాటి అరుదైన నాణేలతో సహా 100 దేశాలకు చెందిన తపాలా స్టాంపుల అరుదైన సేకరణ, 210దేశాల నాణేలు ప్రదర్శనకు ఉన్నాయి. 180 దేశాల కరెన్సీ నోట్లు, అనేక దేశాల అగ్గిపెట్టె కవర్ డిజైన్‌లు, పౌర, రక్షణ పతకాలు, పురాతన, మధ్యయుగ, ఆధునిక భారతదేశపు పురాతన వస్తువుల భారీ సేకరణను సందర్శకులు చూడవచ్చు. ఈ పుస్తకాలు, మ్యూజియం వస్తువులను సింఘి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రతాప్‌సింగ్ సింఘి 30 ఏళ్లు నిరవధికంగా కృషి చేసి సేకరించడం విశేషం. తాజాగా 500 పుస్తకాలను విరాళంగా అందించిన గవర్నర్‌కు ట్రస్టు తరఫున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాజ్‌భవన్‌లో జరిగిన భారీ కార్యక్రమంలో దివంగత కమల్‌సింగ్ సింఘీ రచించిన 'ప్రజ్ఞానబన్ బానో' పుస్తకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. సింగ్ లైబ్రరీ, మ్యూజియం కోసం ప్రమీలా సింఘి, హనుమణి దేవి, ప్రగతి చోప్డా, రాహుల్ సింఘి చేస్తున్న కృషిని ప్రొఫెసర్‌లాల్ అభినందించారు.

# కుదిరిన ఒప్పందం


మంత్రి ప్రమీలా మల్లిక్ సమక్షంలో ఒప్పందం పత్రాలపై సంతకాలు చేస్తున్న అధికారులు

- విపత్తు నిర్వహణపై ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ప్రత్యేకశిక్షణ

**భువనేశ్వర్:** విపత్తు నిర్వహణపై అధికారులందరికీ రాష్ట్ర ప్రభుత్వ శిక్షణ ఇవ్వనుంది. గ్రూపు-డీ నుంచి గ్రూపు-ఏ వరకు అన్ని వర్గాల సిబ్బందికి ఈ శిక్షణ కల్పిస్తారు. 2021 మే 29నాటి మంత్రి మండలి తీర్మానం మేరకు త్రైపాక్షిక అవగాహన కుదిరింది. ఒడిశా రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ(ఓస్డమా), ఒడిశా స్టేట్ ఓపెన్ యూనివర్సిటీ(సంబల్‌పూర్) ఉన్నత విద్యాశాఖ మధ్య విపత్తు నిర్వహణపై శిక్షణ పాఠ్యాంశాల రూపకల్పనకు అవగాహన పూర్తయ్యింది. రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి ప్రమీలా మల్లిక్, ఉన్నత విద్యాశాఖ మంత్రి అతున్ సవ్యసాచినాయక్, ప్రత్యేక సహాయ కమిషనర్ సత్యబ్రత్ సాహు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్, కార్యదర్శి అరవింద్ అగర్వాల్, సమాచార పౌర సంబంధాలశాఖ డైరెక్టర్ సరోజ్‌కుమార్ సామల్, ఒడిశా స్టేట్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, సంబల్‌పూర్ ప్రొఫెసర్ అర్కకుమార్ దాస్ మహాపాత్రొ సమక్షంలో ఎంఓయూపై సంతకాలు చేశారు. ఓస్డమా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జ్ఞాన దాస్, ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి బీరేంద్ర కోర్కరా, ఒడిశా స్టేట్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మానస్ రంజన్ పూజారి ఈ ఒప్పందంలో సంతకాలు చేశారు. ఒడిశా స్టేట్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయనాలు,శిక్షణ, నైపుణ్యం మెరుగుదల కోర్సులను అభివృద్ధి చేయడంలో సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది.

# కాలానుగుణంగా నైపుణ్యాలు తప్పనిసరి


ప్రసంగిస్తున్న డైరెక్టర్ శ్రీపాద కర్మల్కర్

- భువనేశ్వర్ ఐఐటీ డైరెక్టర్ శ్రీపాద కర్మల్కర్

**భువనేశ్వర్:** స్థానిక సెంచూరియన్ యూనివర్సిటీ ప్రో వైస్-ఛాన్సలర్ డాక్టర్ బిశ్వజిత్ మిశ్రా మార్గదర్శకత్వంలో 'ఇంపాక్ట్ ఓరియంటెడ్ ఎడ్యుకేషన్'పై నిర్వహించిన 5రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) సోమవారం విజయవంతంగా నిర్వహించారు. పరిశోధకులు, అధ్యాపకులుగా వృత్తిలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలతో విద్యావేత్తలను సన్నద్ధం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా వక్తలు పేర్కొన్నారు. నల్సార్(హైదరాబాద్), ఐసీఏఆర్(న్యూఢిల్లీ), ఎక్స్ఐఎం యూనివర్సిటీ(భువనేశ్వర్), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ (భువనేశ్వర్), ఎన్‌డీఆర్‌సీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఐఐటీ(భువనేశ్వర్) తదితర ప్రముఖ సంస్థల నుంచి సుమారు 30మంది విద్యావేత్తలు, పరిశోధకులు వక్తలుగా పాల్గొన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలోని ప్రతి క్యాంపస్‌లోని అధ్యాపకులు చురుగ్గా పాలుపంచుకున్నారు. భువనేశ్వర్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మల్కర్ మాట్లాడుతూ... వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటిప్రపంచంలో సాంకేతికత మనం విద్యను అందించే విధానాన్ని విప్లవాత్మకంగా మార్చిందని తెలిపారు. అధ్యాపకులుగా తలెత్తే ప్రతి సవాళ్లను అధిగమించేందుకు సరికొత్త సాధనాలు, వినూత్న ఆలోచనలతో సన్నద్ధం కావాలని సూచించారు. బోధనాంశాల్లో చురుకైన విద్యార్థుల భాగస్వామ్యం కీలకమని, ఆధునిక బోధన కేవలం ఏకపాత్రాభినయం కాకుండా అనుసంధాన విధానంతో అభివృద్ధి చెందుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సెంచూరియన్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ సుప్రియా పట్నాయక్ మాట్లాడుతూ అన్ని వృత్తిపరమైన ప్రయత్నాల్లో నైతిక ప్రమాణాలు, నైపుణ్యం, సానుకూల వాతావరణాన్ని పెంపొందించడంపై సూచనలందించారు. శిక్షణలో వృత్తిలో కలిగి ఉండాల్సిన విలువలు, రచన, పరిశోధన, ఒత్తిడి నియంత్రణ, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

# మండిబిసిలో ఆదివాసీల ఆహార మేళ


ప్రసంగిస్తున్న బిశ్వాల్, వేదికపై జగన్నాథ

**రాయగడ:** జిల్లాలోని కాసీపూర్ సమితి మండిబిసి పంచాయతీ ప్రాంగణంలోఆదివాసీల సంప్రదాయ ఆహర మేళ ఆదివారం నిర్వహించారు. సమితిలోని లివింగ్ ఫార్మ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మేళాలో సుంగేరు, శంకరడ, మండిబిసి, సిరిపాయి, ఒడాజొర్, సింధూరఘాటి తదితర ప్రాంతాలకు చెందిన సమారు 200మందికి పైగా ఆదివాసీలు పాల్గొన్నారు. తమ సంప్రదాయ ఆహరంలో నిత్యం వినియోగించే 30రకాల ఆకుకూరలు, 25రకాల కందలు, 20రకాల పుట్టగొడుగులు వంటిని ఈ ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. ప్రధానంగా అటవీ ప్రాంతంపై ఆధారపడి సేకరించే ఉత్పత్తులు చింత పండు, విప్ప మొగ్గలు, నేరేడు వంటివి కూడా మేళాలో ప్రదర్శించడం కనిపించింది. ఒకప్పుడు చోడి వంటివి పేదలు వినియోగించే ఆహారంగా గుర్తింపు పొందేదని గుర్తుచేశారు. ఇందులో ఉన్న పోషక విలువలు గుర్తించిన ప్రభుత్వం.. దీని వల్ల కలిగే ప్రయోజనాలను ప్రచారం చేయడంతో ప్రస్తుతం చోడితో తయారు చేసే వంటకాలకు విదేశాల్లో సైతం డిమాండ్ పెరిగిందని లివింగ్ ఫార్మ్ సంస్థ క్లస్టర్ జగన్నాథ మజ్జి, బిచిత్ర బిశ్వాల్ వివరించారు. ఆదివాసీల్లో ఇటువంటి పౌష్టిక విలువలు కలిగిన సేంద్రియ ఆహారాన్ని తీసుకోవడంతో ఎంతో ఆరోగ్యంగా ఉంటున్నారని తెలియజేశారు.


ఆహార మేళలో పాల్గొన్న ఆదివాసీలు

## క్లుప్తంగా

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొత్తూరు: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మండలంలోని బలద గ్రామానికి చెందిన చౌదరి మణికంఠ (23) మల్టీ మీడియా కోర్స్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో పని చేస్తుండేవాడు. అయితే కంపెనీని త్వరలో మూసివేయనున్నట్టు యాజమాన్యం నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఈ నెల 23వ తేదీన మణికంఠ హైదరబాద్ నుంచి బలద గ్రామానికి చేరుకున్నాడు. కంపెనీ మూతపడుతున్న విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసి బాధపడ్డాడు. తీవ్ర మనస్తాపంతో ఉన్న మణికంత 24వ తేదీ రాత్రి భోజనం చేసిన తన టెర్రేస్‌కు వెళ్లి అప్పటికే సిద్ధంగా తెచ్చిఉంచుకున్న పురుగు మందు తాగి స్పృహతప్పి పడిపోయాడు. కొద్దిసేపటి తరువాత చూసిన కుటుంబ సభ్యులు వెంటనే కొత్తూరు సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక వైద్యం అందించిన వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 25వ తేదీ రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ఎం.గోవిందరావు చెప్పారు. తల్లి సాయిభవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**ఏడాది క్రితం పెద్ద కుమారుడు..**

చౌదరి సాయిభవాని, శ్యామ్‌లకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కుమార్తెకు వివాహమైంది. పెద్ద కుమారుడు మాధవ్ గత ఏడాది జూలై 13న ఇంటివద్దే పరుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆందంగా లేకపోవడంతో పెళ్లి జరగదనే భయంతో మనస్తాపం చెంది మాధవ్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇప్పుడు రెండో కుమారుడు మణికంఠ కూడా బలవన్మరణానికి పాల్పడడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

### మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

శ్రీకాకుళం క్రైమ్: మాదక ద్రవ్యాల వినియోగానికి అందరూ దూరంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సం సందర్భంగా జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారి చందోలు విజయనాగమణికంఠ (జేడీ) ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని సెబ్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలు, సిబ్బంది వారి పరిధిలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో మాదకద్రవ్యాల జోలికి పోమంటూ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణాకు పాల్పడేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

### రైలు ఢీకొని యువకుడు దుర్మరణం


నీలాపు లోకేష్ మృతదేహం

ఇచ్ఛాపురం: రైలు ఢీకొని వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన పట్టణంలోని పురుషోత్తపురం రైల్వే ఎల్‌సీ గేట్ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు కొట్టడంతో కేదారిపురం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువకుడు నీలాపు లోకేష్ (24) మృతి చెందినట్లు జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు. లోకేష్ రోజూ సాయంత్రం వేళ బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుంటాడు. ఆదివారం కూడా ఇంటి నుంచి బయటికు వెళ్లి.. తిరిగి వచ్చే క్రమంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో చనిపోయి ఉండవచ్చునని జీఆర్‌పీ సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ఆస్పత్రికి తరలించి జీఆర్‌పీ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### దుబాయ్‌లో జగన్నాథపురం వాసి మృతి


అప్పారావు (ఫైల్)

సంతబొమ్మాళి: జగన్నాథపురం గ్రామానికి చెందిన సిమెన్ అర్థ అప్పారావు (38) దుబాయ్‌లో షిప్‌లో పని చేస్తూ అనారోగ్యం కారణంతో మృతి చెందాడు. ఈ మేరకు షిప్ యాజమాన్యం కుటుంబ సభ్యులకు సోమవారం సమాచారం అందించారు. అప్పారావు ఐదేళ్లుగా సీమెన్‌గా పని చేస్తున్నారు. ఆకస్మికంగా చనిపోవడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృతునికి భార్య గాయత్రి, ఇద్దరు అమ్మాయిలు, కుమారుడు, తండ్రి తాతారావు ఉన్నారు. అప్పారావు మృతితో జగన్నాథపురంలో విషాదం నెలకొంది.

### కుదుటపడిన జెడ్పీ చైర్‌పర్సన్ ఆరోగ్యం

అరసవల్లి: ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆరోగ్యం కుదుటపడిందని, ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని, విశ్రాంతి కోసం విశాఖ వెళ్లారని జిల్లా పరిషత్ కార్యాలయ ప్రతినిధులు ప్రకటించారు. విశాఖలో ఉన్నత వైద్య సలహాలను తీసుకోవడంతో పాటు నాలుగైదు రోజుల పాటు విశ్రాంతి తీసుకునేందుకు ఆమె నిర్ణయించుకున్నట్లుగా కార్యాలయ వర్గాలు తెలియజేశాయి.

# వసతి గృహాలు ‣ పిలుస్తున్నాయ్..

- జీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో భారీగా చేరనున్న విద్యార్థులు
- మార్పు, నాడు-నేడు పథకాలతో కొత్త హంగులు


సాంఘిక సంక్షేమ వసతి గృహం

శ్రీకాకుళం పాతబస్టాండ్: విద్యకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా నాడు-నేడు పథకంతో పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను కూడా అంతే సుందరంగా తీర్చిదిద్దింది. దీంతో వీటిల్లో చేరేందుకు పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో జిల్లా సంక్షేమ వసతి గృహాలు విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి. అన్ని వసతులు, హంగులతో బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు సిద్ధమయ్యాయి. వసతి గృహాల్లో మూడో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులు చేరేందుకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు.

**సంక్షేమానికి పెద్దపీట**

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమానికి పెద్ద పీట వేస్తోంది. సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపుతో పాటు, వారు ఉంటున్న భవనాల ఆధునికీకరణ, మెరుగైన సౌకర్యాలు కల్పించింది. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు మంచి భోజనం, వసతి సమకూర్చుతున్నారు. మార్పు, నాడు-నేడు పథకాలతో కోట్లాది రూపాయలు వెచ్చించి వసతి గృహాల మరమ్మతులు, భవరాలకు రంగులు, విద్యుద్దీకరణ, ఆధునిక టాయిలెట్లు, రన్నింగ్ వాటర్ వంటి సదుపాయాలు చేకూర్చింది. దీంతో అన్ని కేటగిరీల వసతి గృహాలు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. విద్యార్థుల ఇంటిని మరిపించేలా వసతి గృహాల రూపురేఖలు మార్చారు.

**పెరిగిన మెస్ చార్జీలు**

విద్యార్థుల మెస్ చార్జీలను సైతం ప్రభుత్వం పెంచింది. గతంలో పోల్చితే 25 శాతం వరకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెరిగాయి. ప్రస్తుతం మూడు నుంచి ఆరు తరగతులకు డైట్ చార్జీలు నెలకు రూ.వెయ్యి, కాస్మోటిక్ చార్జీలు రూ. వంద, ఏడు నుంచి పదో తరగతి వరకు మెస్ చార్జీలు నెలకు రూ.1250, కాస్మోటిక్ చార్జీలు రూ. 125, ఇంటర్ ఆపై తరగతుల వారికి మెస్ చార్జీలు రూ. 1400, కాస్మోటిక్ చార్జీలు 155 రూపాయలు అందజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వసతి గృహాలకు సాధారణ బియ్యాన్ని సమకూర్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం పోర్టుఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తోంది.

**జిల్లాలో పరిస్థితి ఇలా..**

- 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో ప్రీమెట్రిక్ వసతి గృహాలు 20 ఉన్నాయి. వీటిలో 11 బాలురు, తొమ్మిది బాలికలకు కేటాయించారు. వీటిలో ప్రస్తుతం 490 మంది విద్యార్థులు ఉండగా.. ఇంకా 310 మంది చేరేందుకు అవకాశం ఉంది.
- సాంఘిక సంక్షేమ వసతి గృహాలు 11 ఉన్నాయి. వాటిలో బాలురకు ఆరు, బాలికలకు కేటాయించారు. వీటిలో 824 మంది పిల్లలు ఉన్నారు. మరో 409 మంది చేరవచ్చు.
- బీసీ సంక్షేమ ప్రీ మెట్రిక్ వసతి గృహాలు 63 ఉన్నాయి. వీటిలో బాలురు 53, బాలికలకు పది కేటాయించారు. వీటిలో ప్రస్తుతం 4,836 మంది విద్యార్థులు ఉండగా.. మరో రెండు వేల మంది చేరనున్నారు.
- బీసీ పోస్టుమెట్రిక్ 18 వసతి గృహాలు ఉండగా.. వీటిలో బాలురుకి ఎనిమిది, బాలికలకు పది కేటాయించారు. వీటిలో ప్రస్తుతం 2,453 మంది ఉండగా.. మరో వెయ్యి మంది చేరవచ్చు. ఈ వసతి గృహాల్లో పిల్లలు చేరాలంటే కళాశా లలు పూర్తిస్థాయిలో ప్రారంభం కావాల్సి ఉంది.

## ● నేస్తాలొచ్చాయ్..





తొలకరి జల్లులు కురవడంతో మండలంలోని తేలుకుంచి గ్రామంలో విదేశీ పక్షులు కనువిందు చేస్తున్నాయి. సైబీరియా పక్షులు ఈ సీజన్‌లోనే ఇక్కడకు వస్తాయి. ఇప్పుడిప్పుడే వీటి రాక మొదలవుతుంది. ఏటా తొలకరి జల్లులు కురిసే జూన్ నెలలో సైబీరియా నుంచి వచ్చే ఈ పక్షుల అసలు పేరు ఓపెన్ బిల్ స్టార్క్స్ (నత్తగొట్టు కొంగలు, చిల్లు ముక్కు కొంగలు). పగలంతా తంపర భూముల్లో, వరి చేలల్లో తారుగుతూ చేపలు, నత్తలు, కప్పలు, పురుగులు, ఆల్చిప్పలను ఆహారంగా తీసుకుంటాయి. ఆరు నెలలు పాటు తమ పిల్లలతో గడిపిన పక్షులు పక్షి పిల్లలు ఎగిరేంత బలం రాగానే డిసెంబర్, జనవరి నెలల్లో తమ ప్రాంతాలకు పయనమవుతుంటాయి.

–ఇచ్ఛాపురం రూరల్

## డీఈవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కి వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. డీఈవో తిరుమల చైతన్య నిర్లక్ష్య వైఖరిపై జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు నేతృత్వంలో ఎస్.రమణమ్మ, డి.శివజ్యోతిషే క్మునిలు జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. జిల్లా కలెక్టర్ ఆమోదించిన 12 మంది మెడికల్ ప్రిఫెరెన్షియల్ పరిగణించకపోవడం, ఆరుగురు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు మాన్యువల్‌గా రీకౌన్సెలింగ్ జరపడం వల్ల 250 మంది సీనియర్లకు నష్టం జరిగిందని వివరించారు. ఎంటైటిల్మెంట్ పాయింట్ల కేటాయింపులో ఎనిమిదేళ్లు పూర్తి కాకముందే కొందరు మహిళా ఉపాధ్యాయులకు స్పౌజ్ పాయింట్లు కేటాయించడంలో స్వయంగా డీఈవోనే ప్రత్యేక శ్రద్ధ చూపడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఉత్తర్వులు పూర్తిగా ఉల్లంఘిస్తూ పోస్టులు పాఠశాలల పునర్వ్యవస్థీకరణ కసరత్తు అస్తవ్యస్తం చేయడం వల్ల బదిలీల ప్రక్రియ పూర్తయి మూడు వారాలు కావస్తున్నా పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు బదిలీ ఉత్తర్వులు పట్టుకొని ఏస్కూల్‌కి వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారన్నారు. ముగ్గురు విద్యార్థులు ఉన్న పలాస మండలం వీరభద్రపురం ప్రాథమికోన్నత పాఠశాలకు రెండో పోస్టు కేటాయించి, పోలాకి మండలం గుప్పెడుపేట ఒకటి, రెండు తరగతుల్లో 52 మంది విద్యార్థులకు రెండో పోస్ట్ ఇవ్వకపోవడాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించకపోతే డీఈవో వైఖరిని నిరసిస్తూ ప్రత్యక్ష కార్యచరణ రూపొందిస్తామన్నారు.

## జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-19 బాలుర వన్డే క్రికెట్ జట్టు ఖరారైంది. 15 మందితో తుది జట్టు, మరో ఆరుగురు స్టాండ్‌బైతో కూడిన జాబితాను శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పుల్లెల వైఎస్ శాస్త్రి, హసన్ రాజ వెల్లడించారు. తగరపువలసలోని ఓ క్రికెట్ అకాడమీలో శిక్షణ శిబిరాలు, సెలక్షన్ మ్యాచ్‌లు ఇటీవల నిర్వహించిన అనంతరం తుది జట్టును ఎంపిక చేసినట్టు చెప్పారు.

**29 నుంచి అంతర్‌జిల్లాల పోరు**

ఈనెల 29వ తేదీ నుంచి విజయనగరం జిల్లా వేదికగా ఏసీఏ అంతర్‌జిల్లాల అండర్-19 బాలుర వన్డే క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా క్రికెట్‌జట్టు ఈనెల 28వ తేదీన ఇక్కడ నుంచి పయనమై వెళ్లనుంది. ఎంపికైన క్రీడాకారులంతా తమ లగేజిని సిద్ధం చేసుకోవాలని పుల్లెల శాస్త్రి, హసన్‌రాజ తెలిపారు.

**జిల్లా జట్టు వివరాలు:**

డీవీవీ శ్రీరాం (కెప్టెన్), ప్రదియున్‌సాయి (వైస్ కెప్టెన్), సుశాంత్, గణేష్‌సాయి, థామస్ (వికెట్ కీపర్), అజయ్ (వికెట్ కీపర్), సిద్ధాంత్, మోహన్‌రిషి, రోహిత్, సిద్ధూ విజ్ఞేష్, ఎం.పూర్ణచంద్ర, పి.సతీష్, అవినాష్, వెంకటసాయి, సాయిసృజన్. స్టాండ్‌బైగా జైరామ్, రుషికేషి, రాము, యువరాజు, కృష్ణ, అభిషేక్ ఎంపికయ్యారు.

## విద్యార్థి నిజాయితీ


ఉప్పాడ సాయికి కిట్లు అందిస్తున్న మోహన్, స్థానికులు

కాశీబుగ్గ: దారిలో దొరికిన ఖరీదైన సెల్‌ఫోన్ బాధితునికి అందించి ఓ విద్యార్థి తన నిజాయితీ చాటుకున్నాడు. పలాసకు చెందిన లొట్ల మోహన్ జాతీయ రహదారిపై ఉన్న లక్ష్మీపురం టోల్‌ప్లాజాలో పనిచేస్తున్నారు. విధులకు హాజరు కావడానికి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రెడ్డికవీధి మీదుగా ప్రయాణిస్తుండగా రూ.40 వేలు విలువైన సెల్‌ఫోన్ జారిపడిపోయింది. ఈ ఫోన్ ఎనిమిదో తరగతి విద్యార్థి ఉప్పాడ సాయికి దొరికింది. ఆ ఫోన్ మోహన్‌ది అని తెలుసుకుని అతనికి అప్పగించాడు. దీంతో విద్యార్థిని మోహన్‌తో పాటు స్థానికులు అభినందించారు.

## ● ట'మోత'



టమాట ధర మోతెక్కిస్తోంది. ప్రస్తుతం బెంగళూరు మార్కెట్ నుంచి సరుకు వస్తుండడంతో బహిరంగ మార్కెట్‌లో కిలో ధర రూ.80 నుంచి రూ.100 వరకు ఉంది. రైతు బజార్‌లో మాత్రం రూ.60కు విక్రయిస్తున్నారు. పలమనేరు, మదనపల్లి, రాయ్‌పూర్ నుంచి పండ్లు వచ్చినప్పుడు ధర తక్కువగా ఉండేది. ప్రస్తుతం ఉత్పత్తి తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

–శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

## జేసీఐ సన్‌రైజర్స్‌కు అవార్డులు


అవార్డులతో జేసీఐ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్‌కు అవార్డులు లభించాయి. విశాఖపట్నం బీచ్ రోడ్‌లోని సాగరిక కన్వెన్షన్‌లో ఆదివారం రాత్రి జేసీఐ మిడ్‌కాన్ సదస్సు జరిగింది. జేసీఐ చేసిన సేవా, లీడర్ షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ వంటి అద్వితీయమైన కార్యక్రమాలకు గుర్తుగా జోన్-4 ప్రెసిడెంట్ జీఎస్‌ఎన్ వర్మ, వైస్ ప్రెసిడెంట్ అనుదీప్ జోసెఫ్, జోన్ డైరెక్టర్ సురేష్ గొంప గార్ల చేతుల మీదుగా జేసీఐ శ్రీకాకుళం సభ్యులు 12 అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది వేసవి కాలంలో 60 రోజుల పాటు మజ్జిగ పంపిణీ చేసి సుమారు 70 వేల మంది దాహార్తిని తీర్చారని గుర్తు చేశారు. అలాగే పది వేల మంది యువతకు సీపీఆర్‌లో శిక్షణ ఇచ్చారన్నారు. అవార్డులు గెలుచుకున్నవారిలో జేసీలు ఎస్‌వీ సతీష్, ఎస్.ప్రవీణ్, బి.ప్రవీణ్, బి.సతీష్, వి.శిరీష, పి.దామోదర్ తదితరులు ఉన్నారు. వీరందరికీ జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ అధ్యక్షులు డాక్టర్ వినోద్ కుమార్ కూర్మాన, చార్టర్ ప్రెసిడెంట్ సంతోష్ దూసి, ఆర్గనైజేషన్ అడ్వయిజర్ గీత శ్రీకాంత్ అభినందించారు.

## మొక్కలే ప్రాణకోటికి జీవనాధారం


మొక్కలు నాటుతున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రాణకోటికి జీవంపోసే శక్తి మొక్కలకు మాత్రమే ఉందని శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ మూల వెంకట్రావు, డాక్టర్ జి.ప్రమీల, డాక్టర్ భానుమూర్తి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కలు ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్లోబల్ వార్మింగ్‌ను అరికట్టడానికి ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. నాటిన మొక్కల సంక్షరణపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, వాకర్స్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ పి.జి.గుప్తా, ప్రతినిధులు కూన వెంకటరమణమూర్తి, బి.దేవీప్రసాద్, ఎం.మల్లిబాబు, గోలీ ఉమామహేశ్వరరావు, కె.రవి, బడే వెంకటరమణ, సింహాద్రి వేణుగోపాల్ పాల్గొన్నారు.

## జేసీఐ గ్రీన్ సిటీకి అవార్డుల పంట


అవార్డులు అందుకుంటున్న గ్రీన్‌సిటీ ప్రెసిడెంట్, సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: జేసీఐ మిడ్ కాన్ సందర్భంగా ఆదివారం విశాఖలోని ఏయూ కన్వెన్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేశారు. శ్రీకాకుళం గ్రీన్ సిటీకి నాలుగు అవార్డులు వచ్చాయని ప్రెసిడెంట్ మణిశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్ ప్రోగ్రాం, పీఆర్ ఏరియా ప్రోగ్రామ్, జీఅండ్‌డీ ఎడ్యుకేషనల్ డ్రైవ్ అండ్ దాస్ విభాగాల్లో అవార్డులు వచ్చినట్టు పేర్కొన్నారు. సెనేటర్ పి.మధుబాబు అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు. వ్యక్తిగత అవార్డుల్లో అవుట్ స్టాండింగ్ ప్రెసిడెంట్ మణిశర్మకి, అవుట్ స్టాండింగ్ లేడీ మెంబర్స్ వరలక్ష్మి, చార్టర్ ప్రెసిడెంట్ సాయి వినూత, ఉమలకు, యాక్టివ్ మెంటర్స్‌గా జగదీష్, గణపతిలకు అవార్డులు లభించాయి.

# ఆర్తులకు అండగా..


ఫిజియోథెరపీ కేంద్రంలో చికిత్స పొందుతున్న వారు

- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత ఫిజియోథెరపీ సేవలు
- కాళ్లనొప్పులు, నడుంనొప్పులు, కీళ్లనొప్పులకు చికిత్స
- పక్షవాతం కొసం ప్రత్యేక ట్రీట్‌మెంట్
- ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలతో సేవలు



శ్రీకాకుళం కల్చరల్: కాళ్లు, కీళ్ల నొప్పులు, పక్షవాతంతో బాధ పడుతున్న పేదలకు రెడ్‌క్రాస్ పదేళ్లుగా జిల్లా కేంద్రంలో ఉచితంగా చికిత్స అందజేస్తోంది. జిల్లా కేంద్రంలోని మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం భవనంలో అనేక సేవలు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 1 గంట వరకు ఫిజియోథెరపీ సేవలు చేస్తున్నారు. ఆదివారం మాత్రం సెలవు ఉంటుంది. ఈ కేంద్రం ద్వారా పదేళ్లుగా వేలాది మందికి సేవలు అందించారు.

ఈ కేంద్రం స్థాపించిన నాటి నుంచి 5789 మందికి ఉచిత సేవలు అందించారు. ఇప్పటికీ ప్రతి రోజూ దాదాపు 30 మంది ఇక్కడకు వస్తుంటారు. నడుంనొప్పి, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, జబ్బ నొప్పులు, పాదాల నొప్పులు, పెరాలసిస్ వంటి రోగాలకు మసాజ్‌లు నిర్వహించి, ఫిజియోథెరపీ అందిస్తుంటారు.

**ఆధునిక పరికరాలతో..**

ప్రైవేటు ఫిజియోథెరపీకి పోటీగా ఇక్కడ కూడా ఆధునిక పరికరాలు సమకూర్చారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మాన్యువల్‌గా చేసుకొనే పరికరాలు ఉన్నాయి. అత్యధునిక ఎలక్ట్రానిక్ పరికరాలైన ఇన్‌ఫ్రారెడ్ ల్యాంప్, ఐఎఫ్‌టీ యూనిట్, ఆల్ట్రా సౌండ్, మజిల్స్ స్టిమ్యులేటర్, ట్రాక్షన్, పరికరాల ద్వారా ఒంటినొప్పులు, సర్జరీ తర్వాత వచ్చే సమస్యలు, జాయింట్ పెయిన్స్, కండరాల నొప్పులు, నడుంనొప్పులు, మెడ నొప్పులకు ఇవి పనిచేస్తాయి. మాన్యువల్ పుల్లింగ్ ఎక్సర్‌సైజ్, వీల్ ఎక్సర్‌సైజ్, సైకిల్, పాదం ఎక్సర్‌సైజ్, టేబుల్ ఎక్సర్‌సైజ్ పరికరాలతో షోల్డర్ నొప్పులు, ముడుకుల నొప్పులు, పాదం నొప్పులు, పక్షవాతం, కీళ్ల నొప్పులకు ఇవి పనిచేస్తాయి.

**ప్రత్యేక ట్రీట్‌మెంట్**



పక్షవాతం కోసం ఇక్కడ ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ ఇస్తాం. అలాగే ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న వారు, మెడికల్‌గా సమస్యలు వచ్చే వారు అంటే మెడనొప్పులు, కాళ్లు, చేతుల నొప్పులు, కీళ్లనొప్పులు ఎక్కువగా ఉన్న వారు వస్తుంటారు. ఎంతో మంది నయం చేసుకొని వెళ్తుంటారు.

– డాక్టర్ కోరాడ లక్ష్మణమూర్తి, ఫిజియోథెరపిస్టు

**నా నొప్పులు నయమయ్యాయి**



నాకు జబ్బ నొప్పి ఎక్కువగా ఉండేది. చేతులు ఎత్తలేక పోయే వాడిని. ఇక్కడికి గత నెలరోజులుగా వస్తున్నాను. బాగా తగ్గింది.

– బి.యోగేశ్వరరావు, ఇలిసిపురం

**ఉచితంగా చేస్తున్నారు**



ఇక్కడ ఉచితంగా చేస్తున్నారు. ముందులో నేను బయట చేయించుకునే వాడిని. డబ్బులు అధికంగా ఖర్చు అయ్యేవి. ప్రస్తుతం నాకు చాలా బాగా తగ్గింది. – డి.రవి, గుజరాతీపేట

**రెండు నెలలుగా వస్తున్నా**

నాకు పెరాలసిస్ వచ్చింది. నాకు కాలు, చెయ్యి పని చేయడంలేదు. రెండు నెలలుగా వస్తున్నాను. బాగా నయమైంది. ప్రస్తుతం బాగుంది.

– పి.గిరి, హడ్కోకాలనీ

